క్లుప్తంగా

ఘనంగా తొలేళ్ల ఉత్సవం



మల్లంపేటలో గ్రామదేవత ఘటాలతో మహిళలు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటతో పాటు మండలంలోని ఎం.బూర్జవలస, కోమటపల్లి గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, ఘటాలు ఊరేగించారు. అందరూ సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని వేడుకున్నారు. మంగళవారం సిరిమానోత్సవం నిర్వహిస్తారు. దీనికి సంబంధించి, ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించండి



మద్దివలసలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

వంగర: ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించండి అని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. సోమవారం మండల పరిధిలోని మద్దివలస, లక్ష్మీపేట, కొట్టిశ గ్రామాల్లో ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆయన కలిసి ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న విద్య, కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు.

10 రోజుల్లో దుకాణాలు తొలగించాలి



దుకాణదారులకు సూచనలు చేస్తున్న ఆర్ఐ భానుప్రకాష్

రామభద్రపురం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు పక్కన ఉండే దుకాణాలు తొలగించేందుకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇదే విషయమై ఆర్ఐ భానుప్రకాష్, వీఆర్ఓ అప్పలనాయుడు కలిసి సోమవారం దుకాణదారులతో సమావేశమై, రహదారి పనులకు అడ్డుగా ఉన్న దుకాణాలు తొలగించేందుకు స్వతహాగా ముందుకు రావాలని కోరారు. 10 రోజుల్లో తొలగించాలని లేకపోతే అధికారులే తొలగింపు చర్యలు చేపడతారన్నారు. దుకాణాలున్న ప్రాంతాలు ఆర్అండ్‌బీ పరిధిలోనివని ఈ నేపథ్యంలో ఎవ్వరికీ ఎటువంటి పరిహారం ఇవ్వడం జరగదన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువలో చెత్తాచెదారం తొలగిస్తున్న సిబ్బంది

రాజాం: స్థానిక పట్టణ పరిధిలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపడుతున్నారు. సోమవారం పలు వార్డుల్లోని మురుగుకాలువల్లో చెత్తాచెదారం తొలగించి, మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చేశారు. అలాగే కాలువలను ఆనుకుని ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

13 మద్యంసీసాల స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రేజేటి ఉదయకిరణ్ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అనంతరం అతడి వద్ద నుంచి 13 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



గ్లాసులతో మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామంలో సత్యసాయి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని విశ్వసాయి మందిరం వార్షికోత్సవంలో భాగంగా వేసవి దాహార్తి తీర్చేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తెలిపారు. అనంతరం అటువైపుగా వచ్చిపోయే వారికి గ్లాసులతో మజ్జిగ అందజేశారు.

గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు



సంతకవిటి: ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని, పంచాయతీరాజ్ ఆవిర్భావం, దాని ఆవశ్యకతను వివరించారు. గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలని, అవి అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ గ్రామాభివృద్ధికి సహకరించి, దేశ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. అనంతరం ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులను సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: పంచాయతీ కార్యదర్శి దిలీప్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ సులోచన



వంగర: కొప్పరవలస సర్పంచ్ శ్రీరామ్మూర్తిని సన్మానిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తహసీల్దార్ ఐజాక్, ఎంపీడీఓ శ్రీనివాసరావు



రేగిడి: సర్పంచ్ దుర్గమ్మను సత్కరిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి



బాడంగి: ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లను సన్మానిస్తున్న జెడ్పీటీసీ రామారావు, ఎంపీడీఓ అక్కారావు



బొబ్బిలి: సన్మానం అందుకున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది



తెర్లాం: సన్మాన గ్రహీతలతో ఎంపీడీఓ రామకృష్ణ



రామభద్రపురం: రొంపల్లి సర్పంచ్ పెంటమ్మను సన్మానిస్తున్న ఎంపీడీఓ రమామణి



మెంటాడ: బుచ్చిరాజుపేట, గుర్రమ్మవలస, మెంటాడ సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

ప్రతిఇంటా 'సంక్షేమ' కాంతులు



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని అలజంగి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. అలాగే అభివృద్ధి పనులు కూడా ప్రజలు కోరిన వెంటనే మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో జగనన్న సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రజాసంక్షేమమే, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యాం సుందరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం సిటీ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కల్పిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బండి నర్సింహులు కోరారు. సోమవారం మండలంలోని పెనుబాక గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను వినియోగించుకుని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చన్నారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ నేత్ర పరీక్షలు చేయించుకుని, ఏవైనా కంటి సంబంధిత వ్యాధులు ఉంటే వెంటనే చికిత్స చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.బోడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న నారాయణమ్మ

రాజాం సిటీ: నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని, తద్వారా అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎ.నారాయణమ్మ అన్నారు. సోమవారం మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించి, ఖరీఫ్–2023–24 సాగుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తొలకరి చినుకులకు ముందు పొడి వాతావరణంలో 30 రకాల విత్తనాలు ఎకరానికి 13 కేజీల చొప్పున వేసుకోవాలని సూచించారు. ఇవి పంటకు పోషకాలు అందించడంతో పాటు చీడపీడల నివారణలో దోహదపడతాయన్నారు. ఇదే విధంగా మూడేళ్ల పాటు సాగు చేస్తే ఎరువులు, పురుగుమందుల జోలికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఆర్‌బీకేలో నవధాన్యాల కిట్లు లభిస్తున్నాయని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌డీ పి.కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

బాడంగి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పక్కాగా సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)లు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని ఎస్ఆర్‌పీ ఎం.ప్రసాదరావు తెలిపారు. సోమవారం స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, అభివృద్ధి, సిబ్బంది పనితీరు వంటి ఆరు అంశాలకు సంబంధించి, తనిఖీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో తనిఖీలు నిర్వహించి, ఈ నెల 28వ తేదీలోగా వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేసి, సర్వశిక్ష కార్యాలయానికి చేరవేయాలన్నారు. కార్యక్రమంలో మండల సీఆర్‌పీలు రవిబాబు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

రూ.60 వేల నగదు అపహరణపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక ఆంధ్రాబ్యాంక్‌లో సోమవారం జరిగిన రూ.60 వేల నగదు అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన పున్నాన కాంతమ్మ ఓ సంచిలో రూ.60 వేలు పట్టుకుని, ఆంధ్రాబ్యాంక్‌కు వచ్చింది. ఆ డబ్బులతో బ్యాంక్‌లో తాకట్టుపెట్టిన బంగారు నగలు విడిపించాలని అనుకుంది. బ్యాంక్‌కు వచ్చిన కొంతసేపటికి సంచిలో పర్సుతో పాటు నగదు కూడా కనిపించకపోవడంతో లబోదిబోమంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన డబ్బులను దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోండి



ఎంపీపీ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

రామభద్రపురం: తమకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రీన్‌అంబాసిడర్లు కోరుతున్నారు. ఇదే విషయమై వీరంతా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీఐటీయూ నేత బలస శ్రీను ఆధ్వర్యంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీఓ రమామణిలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీపీ స్పందిస్తూ ఈ సమస్యను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

● ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్లపట్టాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కాకరాపల్లికి చెందిన 14 మందికి జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు సోమవారం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకుని, సొంతింటి కల సాకారం చేసుకోవాలని కోరారు. ఇళ్లు నిర్మిస్తున్న వారీగా దశల వారీగా బిల్లులు, నిర్మాణ సామగ్రి కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కాకరాపల్లి సర్పంచ్ వావిలపల్లి రమణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి, గోళ్లవలస సర్పంచ్ దాసరి దాలినాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, తహసీల్దార్ ఎ.సులోచనారాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి ఎవరూ వెళ్లకుండా మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏ సమస్యపై అయినా జిల్లా కేంద్రంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేస్తే మళ్లీ మండలానికే వస్తుందన్న విషయం తెలియజేయాలన్నారు. ప్రతీ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలంతా తమ సమస్యలు తెలియజేసేందుకు రావచ్చన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బస్సు సర్వీసు ప్రారంభం



ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన బస్సు

బొబ్బిలి: ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చొరవతో మండలంలోని ఎం.బూర్జివలస, పనుకువలస, కొత్తపెంట గ్రామాలకు బస్సు సర్వీసు ప్రారంభమైంది. సోమవారం నుంచే గ్రామాలకు బస్సు రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామదేవతల పండగ నేపథ్యంలో వచ్చిపోయే వారి సౌకర్యార్థం గ్రామస్తులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో చొరవ తీసుకున్న ఎమ్మెల్యే బస్సు సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు సదరు అధికారులు ఓ బస్సును ఆయా గ్రామాల మీదుగా రాకపోకలు సాగించేలా సర్వీసులు కల్పించారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి



తహసీల్దార్ విజయభాస్కర్‌తో మాట్లాడుతున్న పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు

రాజాం: పట్టణ పరిధిలోని శ్యాంపురం రోడ్డులో ఉన్న మేదరవీధిలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తహసీల్దార్ ఎం.విజయభాస్కర్‌ను కోరారు. సోమవారం ఇదే విషయమై వారిని వారి వారి కార్యాలయాల్లో వేర్వేరుగా కలిసి, వినతిపత్రం అందజేశారు. మేదరవీధి ప్రజల తాగునీటి కష్టాలు తన దృష్టికి వచ్చిందని, ప్రభుత్వం పట్టణంలోని అన్ని ఇళ్లకు కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని ఆదేశించిందని గుర్తు చేశారు. కుళాయిల ఏర్పాటులో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించి, కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట తిరుమలరావు, చల్లా జయరాం తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు



రేగిడి: కందిశ గ్రామంలో హద్దురాళ్ల ఏర్పాటులో తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి

రేగిడి: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వేలో హద్దురాళ్ల ఏర్పాటు పక్కాగా జరగాలని తహసీల్దార్ టి.కల్యాణ్ చక్రవర్తి అన్నారు. సోమవారం మండలంలోని కందిశ గ్రామంలో చేపడుతున్న హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలించిన ఆయన ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతోందన్నారు. సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు రైతుల సమక్షంలో చేపట్టి, వారి మధ్య ఇంకెప్పుడూ భూ సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్ల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సర్కారును ఆశీర్వదించండి



రేగిడి: వావిలవలసలో మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న గ్రామస్తులు

వాడవాడలా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా జై.. జగన్.. జయహో.. వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ శ్రేణులకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురంలోని కనిమెరక వీధిలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



రేగిడి: ఖండ్యాంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, పోలినాటివెలమ రాష్ట్ర డైరెక్టర్ సురేష్‌కుమార్



రాజాం సిటీ: డీఆర్ఎన్‌వలసలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న గృహసారథులు



రాజాం పట్టణంలో ఇంటింటికీ వెళ్లి, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు



సంతకవిటి: మాధవరాయపురంలో ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌హన్‌రావు